జహీరాబాద్ - బీదర్ రహదారికి మహర్దశ

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు ● నాలుగులేన్ల రోడ్డుగా మార్చాలని విన్నపం



నారింజ బ్రిడ్జి వద్ద చేపట్టిన రోడ్డు పనులు

జహీరాబాద్ టౌన్: రోడ్డంతా మోకాలు లోతు గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడిన జహీరాబాద్-బీదర్ రహదారిని ఎట్టకేలకు అధికారులు మరమ్మతులు చేశారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జహీరాబాద్ నుంచి కర్నాటక రాష్ట్రంలోని బీదర్ టౌన్ వరకు ముప్పై కిలోమీటర్ల వరకు ఆర్అండ్‌బీ రోడ్డు ఉంది. దశాబ్దాల క్రితం వేసిన రోడ్డుపై రద్దీ అధికంగా ఉండడంతో పాటు వర్షాల వల్ల రోడ్డు దెబ్బతిని గుంతలమయంగా మారింది. ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న ఈ రోడ్డును ఫోర్‌లైన్‌గా మార్చేందుకు నేషనల్ హైవే అథారిటీకి బదలాయించారు. ఏడెనిమిది సంవత్సరాల గడుస్తున్నా రోడ్డు అప్‌గ్రేడ్ చేయడంలో జాప్యం జరుగుతుంది. వర్షాలు, వాహనాల రద్దీ తదితర కారణాల వల్ల నారింజ బ్రిడ్జితో పాటు పలు ప్రాంతాల్లో రోడ్డు పూర్తిగా ధ్వంసమయింది. మోకాలిలోతు వరకు గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. గత ఏడాది ఐదారు ప్రమాదాలు చోటు చేసుకుని అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ప్రాణాలు పోతున్నా రెండు శాఖల అధికారులు పట్టించుకోవడంలేదు. ఇదే విషయమై సాక్షి దినపత్రికలో పలు కథనాలు ప్రచురితమైయ్యాయి. ఎట్టకేలకు ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ప్రమాదాల స్పాట్‌గా తయారైన నారింజ బ్రిడ్జి వద్ద దెబ్బతిన్న రోడ్డును తవ్వేసి కొత్త రోడ్డు వేశారు. కొన్ని చోట్ల గుంతలను పూడ్చారు. ప్రస్తుతం రోడ్డు కాస్త మెరుగుపడింది. ప్రభుత్వం స్పందించి త్వరగా జహీరాబాద్-బీదర్ రహదారిని నాలుగులైన్ రోడ్డుగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అందరికీ ఆదర్శనీయురాలు సావిత్రిబాయి

కాంగ్రెస్ నేత నీలం మధు



సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మధు

పటాన్‌చెరు టౌన్: విద్యతోనే స్త్రీకి విముక్తి సాధ్యమని నమ్మి మహిళల్లో చైతన్యం తీసుకుని వచ్చి చదువుకునేలాగా ప్రోత్సహించిన సావిత్రిబాయి పూలే మహిళా లోకానికి దిక్సూచి అని కాంగ్రెస్ నేత నీలం మధు అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా సోమవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్‌లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల హక్కుల సాధనలో ఆమె కీలక పాత్ర పోషించారని అన్నారు. ప్రస్తుతం పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారంటే ఆ మహనీయురాలు కృషితోనే సాధ్యమైందన్నారు.

ఆలయకమిటీ ప్రమాణస్వీకారం



సంతకం చేస్తున్న మద్ది ప్రతాప్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని (బొంతపల్లి) వీరన్నగూడెం గ్రామంలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయ పాలకమండలి సోమవారం ప్రమాణస్వీకారం చేసింది. ఆలయ కమిటీ చైర్మన్‌గా మద్ది ప్రతాప్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ధర్మకర్తలుగా యాదగిరి గౌడ్, ఎం వీరస్వామి, ఎం శ్రీనివాస్ గౌడ్, బజరంగ్‌సింగ్, రాజు, పూజారి కృష్ణ, కోటేశ్వర్ గౌడ్, భాస్కర్ గౌడ్, అశోక్, వీర మల్లేష్, పున్నబోయిన, రాజు, గడ్డం జంగారెడ్డి, ప్రధాన అర్చకుడిగా శివనాగులు ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమానికి టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి నీలం మధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరి సమక్షంలో నూతన పాలకమండలి కొలువు తీరింది.

విజయశాంతి నామినేషన్‌కు వచ్చిన ఎమ్మెల్యే



నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికకు కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మాజీ ఎంపీ విజయశాంతి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సహచర ఎమ్మెల్యేలు సత్యం, శ్రీహరి, నరేందర్‌రెడ్డిలతో కలిసి హాజరయ్యారు. ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తుండడంతో కాంగ్రెస్ పార్టీకి సంబంధించి విజయశాంతి నామినేషన్ దాఖలు చేశారు.

పూర్వ విద్యార్థుల 'సిల్వర్ జూబ్లీ' వేడుకలు



ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని పెద్దాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000-2001లో పదో తరగతి పూర్వవిద్యార్థులు సోమవారం సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి గత అనుభవాలు నెమరువేసుకున్నారు. 25 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరికొకరు పలకరించుకొని వారి జీవన స్థితిగతులు పంచుకుని ఆనందంగా గడిపారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సదాశివరావు, ప్రకాశం, రాజయ్య, చంద్రమౌళి, పాండురంగారెడ్డి, అరుంధతి, జలజ, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

ఇరవై ఏళ్ల తర్వాత కలుసుకొని..

జోగిపేట(అందోల్): అందోల్ మండలం నేరడిగుంట గ్రామ ఉన్నత పాఠశాలలో 2005-06 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇరువై ఏళ్ల తరువాత కలుసుకొని వారంతా అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు.విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో వెంకటేశం, నగేష్‌గౌడ్, యాదయ్య, శివరాజ్, రమేశ్, శ్రీకాంత్, శివ, కవిత, రమాదేవి, దీపిక పాల్గొన్నారు.



అందోల్: నేరడిగుంట గ్రామ ఉన్నత పాఠశాలలో

ఘనంగా స్వయం పాలన దినోత్సవం

మునిపల్లి(అందోల్): మండలంలోని మల్లారెడ్డి పేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం సోమవారం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



స్వయంపాలన దినోత్సవంలో విద్యార్థులు

కేంద్రానిది కార్మిక వ్యతిరేక బడ్జెట్

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్



సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున్

పటాన్‌చెరు టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా కార్మిక వ్యతిరేక బడ్జెట్ అని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ మండిపడ్డారు. సోమవారం పట్టణంలోని శ్రామికభవన్‌లో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ మన కర్తవ్యం అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పెట్టుబడిదారుల బడ్జెట్ అని ఆరోపించారు. ఈ బడ్జెట్ కార్మికులకు, రైతులకు, ప్రజలకు, కూలీలకు, మహిళలకు, సామాజిక తరగతులకు ఎవరికి ఉపయోగపడదని విమర్శించారు. బడ్జెట్‌లో కనీస వేతనం గురించి గాని, కార్మికుల సమస్యలు, ఉద్యోగాల ప్రస్తావనే లేదని అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణలోని బీజేపీ కేంద్ర ప్రభుత్వంలో ఇద్దరు మంత్రులు, ఎనిమిది మంది ఎంపీలు ఉన్న సాధించిది శూన్యమని ధ్వజమెత్తారు. బడ్జెట్‌పై ప్రతి ఒక్కరూ నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి రాజయ్య, ఉపాధ్యక్షుడు పాండురంగారెడ్డి, శ్రీధర్, వెంకటేశ్వరరావు, శంకర్, నరసింహులు, గంగాధర్, పాపయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో గాడి తప్పిన పాలన



మురికి కాల్వలను పరిశీలిస్తున్న నాయకులు

కొండాపూర్ (సంగారెడ్డి): ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, కనీస సౌకర్యాలు కూడా కల్పించిన పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సింలు ఆరోపించారు. సోమవారం సీపీఎం నాయకులు మండల పరిధిలోని తేర్పోల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ.. గ్రామాల్లో మురికి కాల్వల శుభ్రం లేకపోవడంతో దోమలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వాపోయారు. వేసవికాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో మంచినీటి కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉపాధి హామీ కూలీలకు 200 పని దినాలు కల్పించడంతో పాటు రోజుకు కూలీ రూ. 600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు వడదెబ్బ తగలకుండా ఉపాధి ప్రదేశంలో మంచినీళ్ల, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ప్రజలతో కలిసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజయ్య ,వెంకటేశం, సుదర్శన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నపాటి వివాదం
కత్తితో దాడి

పటాన్‌చెరు టౌన్: ఓ వ్యక్తిని కత్తితో పొడిచి గాయపరిచిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ కోటేశ్వరరావు కథనం ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపాలిటీ ముత్తంగి జాతీయ రహదారి పక్కన ఉంటున్న దేవేందర్‌గౌడ్ కుమారుడు సాయికిషోర్, అతని స్నేహితుడు జీవన్‌తో కలిసి పరిశ్రమల విధులు ముగించుకుని శనివారం రాత్రి వారి ఇంటికి సమీపంలో కారు నిలిపారు. అయితే కిర్బీ కాలనీకి చెందిన సురేష్ మరో స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వచ్చి ఇక్కడ కారు ఎందుకు నిలిపారంటూ వారితో గొడవపడి సాయి కిషోర్ బట్టలు చించేశాడు. దీంతో వారు ఇంటికి వెళ్లిపోయారు. అదే దారిలో వెళ్తున్న సురేష్‌ని సాయికిషోర్ తండ్రి నా కుమారుడితో ఎందుకు గొడవ పడ్డారని అడిగాడు. అనంతరం సురేష్ సాయికిషోర్ తండ్రి దేవేంద్రగౌడ్‌పై కత్తితో కడుపులో పొడిచి పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐలాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 11 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపరచగా 11 మందికి ఒక్కొక్కరికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌పోలీసులు పేర్కొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్ వెనకభాగంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ పాండు సిబ్బందితో వెళ్లి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.16,250లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఓల్డ్ బస్తీకి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు నర్సింగరావు (50), గత ఐదు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు ఆనంద్‌కృష్ణారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు, కాలనీవాసులు ఉన్నారు.

ఘనంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో లక్ష్మీఅనంత పద్మనాభ స్వామి బ్రహ్మోత్సవంలో భాగంగా సోమవారం స్వామివారి దివ్య రథోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున్న పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు):

ముసుగు తొలగించరూ..?



ఐబీ వద్ద ముసుగుతో ఉన్న విగ్రహం

సంగారెడ్డి క్రైమ్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మున్సిపల్ అధికారుల ఆదేశాల ప్రకారం పలు విగ్రహాలకు ముసుగులు వేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయి, ఫలతాలు వెలువడి వారం రోజులు గడుస్తున్నా.. ఇంకా విగ్రహాలకు ఉన్న ముసుగు తొలగించలేదు.. దీంతో పట్టణ ప్రజలు అధికారుల తీరుపై అసంతృప్తిం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు మేల్కొని విగ్రహాలకు ఉన్న ముసుగులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఈ పంచాయతీ కార్యదర్శి మాకొద్దు



కార్యదర్శిని నిలదీస్తున్న గ్రామస్తులు

పుల్‌కల్(అందోల్): పంచాయతీ కార్యదర్శిపై గ్రామస్తులు ఉన్నతాధిరులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని సింగూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి రంగయ్య అవినీతికి పాల్పడుతున్నారని ప్రతి దరఖాస్తుకు ఇంత ఇవ్వాలని రేటు ఫిక్స్ చేశాడని గ్రామస్తులు ఆరోపిస్తూ ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. జనన, మరణ ధ్రువపత్రాలకు రూ.5వేలు, నూతన ఇంటి నిర్మాణానికి రూ.40వేల నుంచి రూ.50వేల వరకు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఎవరు ఎంత ఇచ్చారో జాబితాను తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేశారు. అవినీతికి పాల్పడుతున్న పంచాయతీ కార్యదర్శి రంగయ్యపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



పనులను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

న్యాల్‌కల్(జహీరాబాద్): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు ఎంపీడీఓ రాజశేఖర్ కొలాస్ పేర్కొన్నారు. సోమవారం న్యాల్‌కల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాల్‌కల్‌కు 327 ఇళ్లు మంజూరయ్యాయని, వాటిలో 30 ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గౌసొద్దీన్, మాజీ జెడ్పీటీసీ చంద్రప్ప, పీఏసీఎస్ చైర్మన్ సిద్దిలింగయ్యస్వామి, ఏతం మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతులకు అవగాహన

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని రైతువేదికలో మంగళవారం రైతులకు పంటల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఓ సారిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధిక సాంద్రత విధానంలో పత్తిసాగు, యాజమాన్య పద్ధతులు, ఆయిల్ పామ్ సాగులో పాటించే మెలుకవలు, డ్రిప్, స్ప్రింక్లర్‌లతో నీటి తడులు అందించి ఆశించిన దిగుబడులు పొందడం, తదితర అంశాలపై డాట్ శాస్త్రవేత్తలు, ఉద్యానవనశాఖ అధికారుల సమక్షంలో రైతులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఉ.10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి రైతులు విధిగా హాజరుకావాలని కోరారు.

నూతన ఎస్ఐగా భరత్‌కుమార్‌రెడ్డి



కొండాపూర్ (సంగారెడ్డి): కొండాపూర్ ఎస్ఐగా భరత్‌కుమార్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న హరి శంకర్‌గౌడ్ ఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో వికారాబాద్ వీఆర్‌లో ఉన్న భరత్‌కుమార్ రెడ్డి ఎస్సైగా నియామకమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతలను పరిరక్షించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్సీ అంజిరెడ్డికి సన్మానం



అంజిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీ అంజిరెడ్డిను సోమవారం బాలాజీ ఫౌండేషన్ చైర్మన్ బలరాం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, యాదగిరి, గోపాల్ రెడ్డి, వెంటరామిరెడ్డి, మహేష్ ఉన్నారు.

సమస్యలకు నిలయంగా గాంధీనగర్

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్‌లో సమస్యలు తాండవం చేస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. దోమల బెడద, వీధిలైట్లు, అంతర్గత మురికి కాల్వలు వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు అరవల్ బస్తీలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ప్రత్యేక పూజలు**

నారాయణఖేడ్: పట్టణ శివారులోని వెంకటాపూర్ చౌరస్తా వద్ద నూతనంగా నిర్మించిన భక్త మార్కండేయస్వామి ఆలయంలో కొలువైన చంద్రమౌళీశ్వరుడికి సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకం, మహాహారతి, సత్యనారాయణస్వామి వ్రతం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు మహాప్రసాద వితరణ చేపట్టారు.

◆ **వేలం పాట రూ.1.60 లక్షలు**

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని వీరభద్రేశ్వర ఆలయానికి చెందిన టెంకాయల దుకాణం నిర్వహణకు సోమవారం వేలంపాట నిర్వహించారు. ఆలయ చైర్మన్ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ ఈఓ శివరుద్రప్ప ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. దుకాణాన్ని దక్కించుకునేందుకు గ్రామానికి చెందిన రాచయ్య స్వామి, శివశంకర్, సందీప్‌స్వామిలు పోటాపోటీగా వేలంపాట పాడారు. చివరికి సందీప్ స్వామి రూ.1.60 లక్షలకు దక్కించుకున్నట్లు ఈఓ తెలిపారు. దుకాణం దక్కించుకున్న వ్యక్తి తమ నిబంధనలకు లోబడి రెండు సంవత్సరాల పాటు దుకాణాన్ని నిర్వహించుకునే హక్కును కలిగి ఉంటాడని అన్నారు. ఏడాదికి రూ.1.60 లక్షల చొప్పున చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **ఘనంగా మహిళా దినోత్సవం**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నందికంది అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీచర్ విజయలక్ష్మి గ్రామంలోని డ్వాక్రా గ్రూప్ మహిళలను సన్మానించి నూతన వస్త్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామైక్య సంఘం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మల్గిలో సావిత్రిబాయి పూలే వర్ధంతి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మల్గి గ్రామంలో సోమవారం సంఘ సంస్కర్త, ఉపాధ్యాయినీ, రచయిత్రి సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిమ్నవర్గాల అభివృద్ధికి ఆమె చేసిన కృషిని పలువురు కొనియాడారు.

◆ **నేడు వాహనాల వేలం**

సంగారెడ్డి రూరల్: వివిధ కేసులో పట్టుబడిన పది వాహనాలు మంగళవారం వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ నజీర్ పాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు సంగారెడ్డిలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వద్దకు రావాలని కోరారు.

◆ **మాజీ కౌన్సిలర్‌కు పరామర్శ**

నారాయణఖేడ్: మున్సిపాలిటీ 14వ వార్డు మాజీ కౌన్సిలర్ నూర్‌జహాన్‌బేగం అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

◆ **చదువు ఎంతో ముఖ్యం**

పటాన్‌చెరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే చదువు ఎంతో ముఖ్యమని విశ్వభారతి లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భవాని అన్నారు. సోమవారం విశ్వ భారతి లా కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం భవాని మాట్లాడుతూ... మహిళల చదువుతో పాటు వారి హక్కుల సాధనలో సావిత్రిబాయి పూలే కీలకపాత్ర పోషించారని తెలిపారు. పని చేసే చోట మహిళలు ఒకరికొకరు సహకరించుకొని ముందుకు సాగాలన్నారు.